ప్రజాశక్తి

ఆదివారం 1 జూన్ 2025 | 5 | అనంతపురం

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

- పాఠశాలలు ప్రారంభం.. ఫీజుల భయం
- తల్లిదండ్రుల్లో ఫీజుల దడ
- ప్రారంభమైన ఖరీఫ్ సీజన్
- రైతులకు పెట్టుబడుల బెంగ

- ఈ నెలంతా ఏదో రూపంలో ఖర్చులే
- తల్లికివందనం.. అన్నదాత సుఖీభవ సాయంపై ఆశలు

వామ్మో జూన్..!

పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబ సభ్యులకు జూన్ నెల భయం పట్టుకుంది. భారాల మాసంగా పిలవబడే ఈ నెలలో ఏదో రూపంలో జనంపై భారాలు పడుతూనే ఉంటాయి. విద్యార్థుల తల్లిదండ్రులకు జూన్ ఫీవర్ మరింత ఎక్కువగానే ఉంటుంది. భరించలేని ఫీజుల భారాలు, పుస్తకాలు, యూనిఫాం ఖర్చులన్నీ ఒకే సారి వస్తాయి. నోట్ల కట్టలతో పిల్లలను పాఠశాలలకు పంపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక ఖరీఫ్ సీజన్ కూడా ఈ నెల నుంచే ప్రారంభం అవుతుంది. తొలకరి వర్షాలు పడడంతో రైతులు ఖరీఫ్ సేద్యాన్ని ప్రారంభిస్తారు. పంటల సాగు నిమిత్తం పెట్టుబడుల కోసం రైతుల వెతుకులాట ప్రారంభం అవుతుంది. ఓ వైపు విద్యా సంవత్సరం.. మరో వైపు ఖరీఫ్ సీజన్ ఒకే సారి ప్రారంభం కావడంతో అన్ని కుటుంబాలపై ఏదో ఒక రూపంలో జూన్ భారం పడుతుంది.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్కూల్ ఫీజుల భయం..!

వేసవి సెలవులు ముగింపు దశకు వచ్చేశాయి. మరో 10 రోజుల్లో పాఠశాలలు పున:ప్రారంభం అవుతాయి. ఇప్పటికే ప్రయివేటు పాఠశాలలు తెరిచారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లను చేసేస్తున్నారు. పుస్తకాలు వచ్చాని, వెంటనే తీసుకోవాలంటూ తల్లిదండ్రులకు ఫోన్లుమీద ఫోన్లు చేస్తున్నారు. ముందస్తు ఫీజులు, పుస్తకాలు కొనుగోలు చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. కొత్త ఏడాది పిల్లల్ని పాఠశాలలకు పంపాలంటే ఇద్దరు విద్యార్థులు ఉన్న కుటుంబంలో ప్రయివేటు పాఠశాల అయితే రూ.40వేలు, కార్పొరేట్ పాఠశాల అయతే రూ.లక్షకు పైగా ఖర్చు చేయాల్సి ఉంది. ఫీజుల మోతతో తల్లిదండ్రులపై మోయలేని భారం పడుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1200 ప్రయివేటు పాఠశాలలు, 500 వరకు కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 1.50 లక్షల మందికి పైగానే విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ నోట్ల కట్టలతోనే పాఠశాలలకు వెళ్లాలి. నర్సరీ స్థాయి నుంచే ఫీజుల రూపంలో రూ.25 నుంచి రూ.50వేల వరకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు వసూలు చేస్తున్నాయి. విద్యార్థి తరగతి పెరిగే కొద్దీ ఫీజుల భారం కూడా పెరుగుతూ పోతోంది. హాస్టల్ ఫీజులు, పుస్తకాలు, యూని ఫామ్స్ ఇలా అన్నింటికీ లక్షల్లోనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇంట్లో ఇద్దరు పిల్లల ఉంటే ప్రస్తుతం కొంత ఫీజు కట్టి, పుస్తకాలు, యూనిఫాం తీసుకోవాలంటే రూ.70వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక ఇంటర్, ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు అయితే వారు చదివే కళాశాలలను బట్టి ఒక్కొక్కరికి హాస్టల్, ఫీజులకు రూ.3 లక్షల వరకు ఖర్చు వస్తోంది. టెక్నో, సిబ్యాచ్, నీట్, ఎంసెట్, జెఇఇ, జెఇఇ అడ్వాన్స్‌డ్ తదితర వాటికి మరింత అదనంగా ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. డబ్బున్న వారికి ఇది పెద్ద సమస్య కాకున్నా సామాన్యులు, చిరుద్యోగులకు పెనుభారంగానే ఉంటోంది. ఫీజుల నియంత్రణ అంటూ ప్రభుత్వాలు చెబుతున్న మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి.

నోట్ల కట్టలతో విద్యాలయాలకు..!

ఒకప్పుడు విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో విద్యాలయానికి వెళ్లే వారు. కార్పొరేట్ విద్యా వ్యాపారం రాకతో తల్లిదండ్రులు నోట్ల కట్టలతో అక్కడికి వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయి. గడిచిన పదేళ్ల కాలంలో వందలు వేలుగా, వేలు లక్షల్లాగా ఫీజులు పెరిగాయి. కార్పొరేట్ పాఠశాల అంటే చాలు లక్షల్లోనే ఫీజుల మాట విన్పిస్తోంది. అది కూడా ఎల్‌కెజి, యుకేజీ స్థాయికే ఈ స్థాయిలో డబ్బులను తల్లిదండ్రులతో లాగేస్తున్నారు. తమ పిల్లలు తమలా కాకుండా.. మంచిగా జీవితంలో స్థిర పడాలన్న ఉద్దేశంతో తల్లిదండ్రులు వారి కష్టాన్ని మొత్తం ఫీజుల రూపంలో ప్రయివేటు, కార్పొరేట్‌కు దారబోస్తున్నారు.

తల్లికి వందనం.. అన్నదాత సుఖీభవపై ఆశలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంకా తల్లికి వందనం అందలేదు. ఎంత మంది పిల్లల్ని చదివిస్తున్నా అందరికీ తల్లికి వందనం ఇస్తామంటూ కూటమి నేతలు ఎన్నికలకు ముందు ప్రకటించారు. పాఠశాలల ప్రారంభం రోజు అంటే జూన్ 12న తల్లుల ఖాతాల్లో ఈ డబ్బులు వేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటిం చాడు. దాని కోసం చాలా మంది తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. ఇక అన్నదాత సుఖీభవ అమలు కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు రైతుకు ఎలాంటి సాయం అందలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఖరీఫ్ పెట్టుబడి రాయితీ కింద ఎకరాకు రూ.20వేలు సాయం అందించి పంట సాగును ప్రోత్సహించాలని రైతులు కోరుతున్నారు.

అన్నదాతకు పెట్టుబడుల బెంగ

వ్యవసాయానికి సంబంధించి జూన్ నెల రైతులను కలవర పెడుతుంది. ఖరీఫ్ సీజన్ ఈ సమయంలోనే ప్రాంభం అవుతుంది. తొలకరి చినుకుల రాకతో పొలం పనులు ప్రారంభం అవుతాయి. ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కురిసిన ముందస్తు వర్షాలతో రైతులు వేసవి దుక్కుల పనుల్లో నిమగ్నం అయ్యారు. సబ్సిడీ వేరుశన విత్తనకాయలకు సంబంధించి రిజిస్ట్రేషన్ పనులు మొదలయ్యాయి. గతేడాది సరిగా పంటలు చేతికందక పెట్టుబడులు కూడా చేతికి రాలేదు. ఉద్యానవన రైతులు కూడా దిగుబడులు రాక నష్టాలను చవిచూశారు. ఈ నేపథ్యంలో రైతుల చేతిలో చిల్లిగవ్వలేకుండానే వ్యవసాయ పనులను ప్రారంభించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విత్తనాలు, పురుగు మందుల కొనుగోలు, పొలం పనులు, కూలీలు ఇతరత్రా వాటికి ఎకరాకు రూ.30వేల వరకు పెట్టుబడులు ఖర్చు చేయాల్సి ఉంది. చేతిలో చిల్లిగవ్వ లేక రైతులు పంట సాగుకోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

బదిలీలు, ప్రమోషన్ల కోసం తీసుకున్న మెడికల్ సర్టిఫికెట్లను పున : పరిశీలించాలి

డిఇఒకు యుటిఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రస్తుతం బదిలీలు, ప్రమోషన్‌ల కోసం తీసుకున్న మెడికల్ సర్టిఫికెట్లు పున: పరిశీలించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు లింగమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ ఎం.ప్రసాద్ బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత బదిలీల ప్రమోషన్ల కోసం తీసుకున్న మెడికల్ సర్టిఫికెట్లను పున్ణ పరిశీలించాలని అవసరమైతే స్టేట్ మెడికల్ బోర్డుకు పంపి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎవరైనా వాటిని దుర్వినియోగ పరిస్తే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2021 బదిలీల నుంచి 2023 బదిలీల వరకు ప్రిఫరెన్షియల్, స్పౌస్ వాడుకున్న ఉపాధ్యాయుల జాబితాలు ప్రకటించాలన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన సీనియారిటీ జాబితాలలో సమాన పాయింట్లు వచ్చిన వారిని డేట్ అఫ్ బర్త్ ప్రాతిపదికన తీసుకొని సిరియార్టీలు పొందుపరచడం జరిగిందన్నారు. కానీ ఇటీవల ఎఫ్ఏ క్యూలో ఇచ్చిన క్లారిఫికేషన్‌కు అనుగుణంగా డేట్ ఆఫ్ బర్త్‌కు బదులు డీఎస్సీ ర్యాంక్ ప్రాతిపదికన తీసుకొని సీనియారిటీ జాబితాను సరి చేయాలని కోరారు. ప్రస్తుతం ఇస్తున్న ప్రమోషన్స్‌కు సంబంధించి సబ్జెక్టుల వారీగా క్యాడర్ల వారీగా ఫిజికల్లీ చాలెంజ్ వారికి సంబంధించిన అడెక్వసీని ప్రకటించాలన్నారు. ఈ రిజర్వేషన్స్‌కు సంబంధించి అర్హులైన వారిని ఎంపిక చేయాలన్నారు. అసంబద్ధంగా జాబితాలను పొందుపరిచిన వారిపై దుర్వినియోగపరిచిన వారిపై శాఖా పరమైన చర్యలు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బదిలీలు, ప్రమోషన్‌ల ప్రక్రియలో పారదర్శకతను, నిబంధనలను పాటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు నాగేంద్ర, కోటేశ్వరప్ప, నాయకులు ఆదిశేషయ్య, శ్రీనివాసులు, కప్పల రామ్మూర్తి, శివప్రసాద్, ఓబులపతి, ధనుంజయ పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

జన విజ్ఞాన వేదికలో భాగస్వాములు కండి

జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం నిరంతరం కృషి చేస్తున్న జనవిజ్ఞాన వేదికలో భాగస్వాములు కావాలని జెవివి రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ కోరారు. స్థానిక సంగమేష్ నగర్‌లోని జెవివి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెవివి సభ్యత్వ ప్రచారానికి సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. అనంతరం గేయానంద్ మాట్లాడుతూ ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, దేశ స్వావలంబన కోసం సైన్స్ అనే నినాదాలతో 38 సంవత్సరాలుగా తెలుగు ప్రజలతో జెవివి మమేకమై పని చేస్తోందన్నారు. శాస్త్రీయంగా ఆలోచించాలని, మానవత్వంతో జీవించాలని ఆకాంక్షిస్తూ శాస్త్ర ప్రచారంలో ప్రజలను చైతన్య పరచటంలో జెవివి తన వంతుగా కృషి చేస్తోందన్నారు. ప్రజలు చేసే శాస్త్రీయ ఆలోచన క్రమాన్ని ఆటంకపరచి, అడ్డుకునే శక్తులు ప్రస్తుత సమాజంలో అనేకం ఉన్నాయని, అలాంటి వాటి నుంచి ప్రజలను అప్రమత్తం చేసే కర్తవ్యం జనవిజ్ఞాన వేదిక చేస్తుందని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో పని చేస్తున్న అతి పెద్ద ప్రజాసైన్స్ ఉద్యమవేదిక అయిన జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమం జూన్ 1 నుంచి జూలై 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందన్నారు. అందులో భాగంగా అనంతపురం జిల్లాలో కూడా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామనిఅధిక సంఖ్యలో జెవివిలో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జిల్లా కోశాధికారి మహమ్మద్ జిలాన్, నగర నాయకులు రామిరెడ్డి, తిరుపాల్, ప్రసాద్ రెడ్డి, ప్రసాద్, లక్ష్మీనారాయణ, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు-కళ్యాణదుర్గం మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మార్కెట్ యార్డు అభివృద్ధే లక్ష్యంగా లక్ష్యంగా పని చేద్దామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గం మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం స్థానిక యార్డులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్‌గా గోళ్ల లక్ష్మీదేవి, వైస్‌ఛైర్మన్ కోనంకి రాజశేఖర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గోళ్ల బాదన్న టిడిపితోపాటు మార్కెట్ యార్డు అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. ఆయన బాటలోనే నడవాలని ఆయన కోడలు లక్ష్మీదేవి రమేష్‌కు ఛైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించినట్లు తెలిపారు. తామిద్దరం కలిసి గోళ్ల బాదన్న బాటలో నడుస్తూ యార్డు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మార్కెట్‌యార్డులో కనీస మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం కొత్తగా రూపుదిద్దుకోనున్న వాల్మీకి సర్కిల్ నమూనాను విడుదల చేశారు.



కళ్యాణదుర్గం మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్‌కు బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



కార్యకర్తలను సన్మానిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

వైసిపి ఆగడాలను సమర్థంగా తిప్పికొట్టారు

సోషల్ మీడియా కార్యకర్తలకు విప్ కాలవ ప్రశంస

ప్రజాశక్తి-రాయదుర్గం

సోషల్ మీడియా కార్యకర్తలు గత వైసిపి ప్రభుత్వ ఆగడాలను సమర్థవంతంగా తిప్పికొట్టారని విప్ కాలవ శ్రీనివాసులు గుర్తుచేశారు. గుమ్మగట్ట మండలానికి చెందిన పలువురు టిడిపి సోషల్ మీడియా కార్యకర్తలను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలనలో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్న కక్షతో పలువురు టిడిపి నాయకులపై అక్రమ కేసులు బనాయించారన్నారు. ఇందులో భాగంగానే గుమ్మగట్ట మండలం శిరిగేదొడ్డి గ్రామానికి చెందిన మేకల తిప్పేస్వామి, కిందింటి హరినాథ్, అట్టయ్యగారి పరమేష్‌ను వేధించారన్నారు. వారంతా సమర్థవంతంగా వాటిని తట్టుకుని ధైర్యంగా ఎదుర్కొన్నారన్నారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించగా కోర్టు ముగ్గురిపై పెట్టిన కేసులు కొట్టి వేసిందని వివరించారు. ఇలాంటి వాటిపై పోరాడినప్పుడే మన సత్తా ఏమిటో బయట పడతాయన్నారు.

లిక్కర్ స్కాంలో జగన్ బ్యాచ్‌కి జైలే : ఎమ్మెల్యే దగ్గుపాటి

పజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గాలి జనార్దన్ రెడ్డి తరహాలో లిక్కర్ స్కామ్‌లో జగన్ అండ్ కో కూడా జైలుకు వెళ్లక తప్పదని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం నగరంలోని పలు కాలనీల్లో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా నారాయణపురం గ్రామపంచాయతీలోని సోమనాథ్ నగర్ చౌరస్తా నుంచి పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ప్రతి నెల సచివాలయం సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పింఛన్ల పంపిణీ చేస్తున్నారా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ రెండు రోజుల క్రితం సచివాలయం ఉద్యోగిని స్థానిక టిడిపి నాయకుడు ఫోన్‌లో దూషించిన సంఘటన మీద ఖచ్చితంగా చర్యలు ఉంటాయని తెలిపారు. ఉద్యోగుల మీద ఎవరైనా దురుసుగా వ్యవహరిస్తే ఉపేక్షించేది ఉండదన్నారు. ఏ పార్టీ అయినా చర్యలు ఉంటాయన్నారు. ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకెళ్తుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, తహశీల్దార్ హరికుమార్, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

కార్మిక, రైతుల కష్టాలు పట్టవా ..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో తాగునీటి పథకాల్లో పనిచేసే కార్మికుల గోడు పాలకులకు పట్టడం లేదు. ప్రజలకు నీటిని అందించేందుకు అహర్నిశలు పనిచేసే కార్మికులకు మాత్రం ఎప్పుడూ పస్తులు తప్పడం లేదు. వేతనాల కోసం ప్రతి నిత్యం పోరాటం సాగించాల్సిన పరిస్థితే నెలకొంది. పనిచేసినందుకు నెలల తరబడి వేతనాలివ్వకపోవడంతో వారు సమ్మెలోకెళ్లాల్సి వస్తోంది. అప్పుడూ ఎంతోకొంత సర్దుబాటు చేయడం మమ అనిపించడమే జరుగుతోంది. ప్రధానంగా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల పరిస్థితి ఎప్పుడూ ఇదే తీరున ఉంటోంది. ప్రస్తుతం ఆ కార్మికుల సమ్మెలో ఉండటంతో గ్రామాలకు తాగునీరు కూడా అందక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండటం లేదు. కాంట్రాక్టరు మాత్రం ప్రభుత్వం నుంచి బిల్లులు రాలేదని, అవి వస్తే ఇస్తానని చెబుతుండటంతో వేతనాల కోసం కార్మికులు సమ్మెబాట పట్టక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఇతర సిడబ్లుసి పథకాల్లోనూ ఇదే తీరు కొనసాగుతోంది. తరచూ ఈ సమస్య రావడానికి ప్రధాన కారణం ప్రభుత్వ విధానంలోని లోపమేనన్న విమర్శ ఉంది. పథకాల మంజూరుకు కోట్లాది రూపాయల నిధులను ప్రభుత్వం వెచ్చిస్తోంది. కాని వాటి నిర్వహణకు మాత్రం నిధులు ప్రత్యేకంగా కేటాయించడం లేదు. స్థానిక సంస్థలకు వచ్చే నిధులనే వీటికి వాడుకోవాల్సి ఉంటోంది. స్థానిక సంస్థలకు నిధుల విడుదలకు జాప్యం జరిగినా,ఇతర అవసరాలకు వినియోగించినా వీటి నిర్వహణ కింద పనిచేసే వారికి డబ్బులు చెల్లించడంలో జాప్యం జరుగుతోంది. ఫలితంగా కార్మికులకు వేతనాలు అందటంలో తీరని జాప్యం జరుగుతోంది. వారు పోరాటం చేసినప్పుడు ఇతర పథకాల నుంచి సర్దుబాటు చేసి ఇస్తున్నారు. దీనికి ప్రత్యేకమైన హెడ్ ఏర్పాటు చేసి నిధుల కేటాయింపులు జరపాలని పథకం కింద పనిచేసే కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు. ప్రత్యేకంగా దీనికి నిధులొస్తే ఇబ్బందులుండవని సూచిస్తున్నారు. కాని కాంట్రాక్టును ఏ రకంగా దక్కించుకోవాలని నేతల ఆలోచనలుంటున్నాయే తప్ప నిధుల కేటాయింపులపై మాత్రం దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. కార్మికుల సమస్యలు ఈ విధంగా ఉంటే రైతుల సమస్యలు మరో రకంగానున్నాయి. మే నెలలో జిల్లాలో మంచి వర్షాలు పడ్డాయి. దీంతో రైతులు దుక్కులు దున్నుకుని పొలాలను సిద్ధం చేసుకున్నారు. వచ్చే నెలలో మంచి వర్షాలు పడితే ముందస్తుగా విత్తనం విత్తుకునేందుకు కూడా రైతులు సమయత్తమవుతున్నారు. కాని ఇప్పటి వరకు ప్రభుత్వం మాత్రం రైతుకు అవసరమైన విత్తనం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోలేదు. ఇంకా విత్తన సేకరణలోనే ఉండిపోయింది. ఇతర పంటల సాగుకు తగిన చర్యలేవన్న విమర్శలున్నాయి.ఇకపోతే రైతుకు అందిస్తామన్న అన్నదాత సుఖీభవను ఇస్తారో లేదో తెలియకుండా ఉంది. కేంద్రమిస్తే, దానితో కలిపిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తోంది. అది ఎప్పుడన్నది మాత్రం ఇంకా నిర్ధారణ అవలేదు. ఖరీఫ్ పంటల సాగుకు రైతులు పెట్టుబడుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతుకు భరోసానివ్వాలని కోరుతున్నారు.ఇక గత వారంలో రాజకీయంగా హడావుడి అంతా అధికార తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడు చుట్టూ జరిగింది. సత్యసాయి జిల్లాలో అక్కడి జిల్లా మహానాడు జరిగింది. ఆ తరువాత కడప జిల్లాలో జరిగిన మహానాడుకు నేతలంతా తరలివెళ్లారు.

రైతులు యాంత్రీకరణ పద్ధతులు పాటించాలి

జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలయకులు ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

రైతులు తప్పనిసరిగా యాంత్రీకరణ పద్ధతులు పాటించి వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఉమామహేశ్వరమ్మ సూచించారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శనివారం పెద్దవడుగూరు రైతు సేవాకేంద్రంలో యాంత్రీకరణ తదితర వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయంలో సాగు చేసే లోతుదుక్కుల వల్ల ఎంతో ప్రయోజనం ఉందన్నారు. వీటిని వేసవిలో అనుసరించాలన్నారు. భూసార సంరక్షణ, యాంత్రీకరణ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. అలాగే డ్రోన్ వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా వ్యవసాయం ఎంతో లాభాదాయకంగా ఉంటుందని వివరించారు. అనంతరం తదితర పంటల సాగు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మల్లీశ్వరమ్మ, కిషోర్, లక్ష్మణ్, మండల వ్యవసాయాధికారి మల్లీశ్వరి, వ్యవసాయ విస్తరణాధికారులు సునీత, రజనీ, ఎంపిఇలు శిరీషా, భవాణి, విఎఎ జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలయకులు ఉమామహేశ్వరమ్మ

పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరం

నివారణ దినోత్సవంలో వక్తలు

మెడికల్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మాణిక్యరావు

ప్రజాశక్తి-అనంతపురం

పొగాకు ఉత్పత్తుల వాడకం ఆరోగ్యానికి హానికరమని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు అన్నారు. ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికల్ కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ రెస్పిరేటరీ మెడిసిన్, డిపార్ట్మెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకాలు జీవితాలను చిన్నాభిన్నం చేస్తాయన్నారు. ముఖ్యంగా పొగాకు క్యాన్సర్‌కు కారకమన్నారు. కావున పొగాకు ఉత్పత్తుల జోలికి వెళ్లొద్దని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జీవితంలో పొగాకు వాడకానికి వ్యతిరేకంగా ఉంటామని ప్రమాణం చేసుకుని మంచి ఆరోగ్యంతో జీవించి కుటుంబానికి రక్షణగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్వాసకోశవ్యాధి విభాగం ప్రధాన విభాగాధిపతి డాక్టర్ రామస్వామి, రెస్పిరేటరీ మెడిసిన్ సహాయ ఆచార్యులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ కావేటి సతీష్‌కుమార్, డాక్టర్ సౌజన్యలక్ష్మి, వైద్యులు సురేష్, ఆదినరేష్, సుమన గోపీచంద్, మనోరంజన్‌రెడ్డి, అనిల్‌కుమార్, వరదరాజులు, నీరజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీని డిఎంహెచ్ఒ ఇబి దేవి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. ఇందులో భాగంగా పొగాకు వినియోగానికి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. డిఎంహెచ్ఒ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ తెలుగు తల్లి కూడలి వరకు సాగింది. ఈ కార్యక్రమంలో పొగాకు నియంత్రణ కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ నారాయణస్వామి, పరిపాలన అధికారి గిరిజ మనోహర్, మలేరియా అధికారి ఓబులు, ఎస్ఒ మహ్మద్ రఫీ, డెమో సిబ్బంది త్యాగరాజు, గంగాధర్, యస్ హెచ్ యం సిబ్బంది కిషోర్ కుమార్, ఫణి మరియు జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ శ్రీరాములు మరియు ఎన్సీడీ సిబ్బంది జిల్లా ఫ్లో రోసిస్ కన్సల్టెంట్ ఆంజనేయులు ప్రేమ్,కిషోర్, శశి, మౌనిక పాల్గొన్నారు

పుట్లూరు : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా పొగాకు వల్ల కలిగే నష్టాలపై ఫ్లెక్సీలు పెట్టి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, ఫీల్డ్ స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణ అందరి బాధ్యత..

పొగాకు నియంత్రణ అందరి బాధ్యత అని ప్రముఖ ఛాతీ వైద్యులు డాక్టర్ రంగా సుధీంద్ర పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు నియంత్రణ దినోత్సవ సందర్భంగా శనివారం ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ పొగాకు నియంత్రణ, అవగాహనను ప్రోత్సహించే కార్యక్రమాలు, ప్రచారాలు, చొరవలను ప్రభుత్వ ప్రభుత్వ సంస్థలు వివిధ నిర్వహిస్తాయి. పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను తెలియజేయాలన్నారు. పొగాకు వినియోగం ద్వారా ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 8 మిలియన్లకుపైగా ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఆరోగ్య ప్రమాదాలను తగ్గించడానికి పొగాకు తప్పనిసరిగా మానేయాలన్నారు.

అనంతపురం : ప్రజల్లో చైతన్యం వస్తేనే ధూమపానం నిషేధం సాధ్యమని ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎవి ప్రసాద్ తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ సి.చక్రధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఎసీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనాథ్, జాతీయ సేవా పథకం పిఒ జి.ఆనంద్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ ఇబి దేవి

యాడికి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై ప్రభుత్వ వైద్యులు పరమేశ్వర్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సాయి సుమంత్‌రెడ్డి, సిహెచ్ఒ జబీదా, సూపర్‌వైజర్ రాంప్రసాద్‌గౌడ్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్పల : పొగాకు రహిత సమాజ స్థాపన కోసం అందరం కలిసి ముందుకు సాగుదామని నార్పల ప్రాథమిక వైద్యశాల వైద్యులు ప్రవీణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటే జీవన ప్రమాణం పెంపొందుతుంది అన్నారు. కావున ప్రతి ఒక్కరూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యునాని వైద్యులు రఫీవుద్దీన్‌ఖాన్, సిహెచ్ఒ బాలాజీ, సూపర్‌వైజర్ ఆక్కులప్ప, ఫార్మసిస్ట్ రాజేంద్ర, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : పొగాకు రహిత సమాజ స్థాపన మన అందరి బాధ్యత అని జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, కవి సామాజిక కార్యకర్త రాజన్న అన్నారు. శనివారం జన విజ్ఞాన వేదిక తరుపున మండల కేంద్రంలో పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే నష్టాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిటి టీచర్ నాగరాజు, రాజప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరవకొండ : రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పావని ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాబృందం

బ్రహ్మసముద్రం : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని వేపులపర్తి సచివాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జంగం శ్రీనివాసులు కళా బృందం హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించింది. ఇందులో భాగంగా హెచ్ఐవి, ఎయిడ్స్ ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తులపై వివక్షత, చిన్న చూపు లేకుండా ఎలా ఉండాలనే విషయాలను ప్రాజెక్టు మేనేజర్ మహేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో డెవలప్‌మెంట్ సొసైటీ సంస్థ (రిడ్స్) ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్, ఎంఎల్ కిరణ్‌కుమార్, ఎఎన్ఎం వరలక్ష్మి, ఒఆర్‌డబ్ల్యూస్ పద్మ, నీలావతి, నాగరాజు పీర్ ఎడ్యుకేటర్ మరెక్క, అనూషా, తిప్పేరుద్ర, లక్ష్మీదేవి, యశోద, పుష్ప, జంగం శ్రీనివాసులు కళా బృందం, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి

అనంతపురం కార్పొరేషన్ : చిన్నారులపై అత్యాచారాలు, లైంగిక వేధింపులకు పాల్పడుతున్న మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, అహుడా ఛైర్మన్ టిసి వరుణ్ కోరారు. వైఎస్ఆర్ కడప జిల్లా కంబాలదిన్నెలో మూడేళ్ల బాలికపై సొంత బంధువే అత్యాచారం చేసిన ఘటనపై ఆయన స్పందించారు. ఘటనను ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తీవ్రంగా ఖండించారన్నారు. దీనికి తోడు పోక్సో కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆదేశించారన్నారు. ఇలాంటి సైకోలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

పౌరహక్కులపై అవగాహన

బ్రహ్మసముద్రం : పౌరుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల పరిధిలోని గుండిగానిపల్లి గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సుమతి ప్రజలకు పౌరుల హక్కులు, రాజ్యాంగ విలువలు, సమానతలు, అసమానతలు, చట్టం దృష్టిలో అందరూ సమానమేనని తదితర విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వో ఆంజనేయులు, బజ్జన్నగౌడ, రవీంద్ర, రామచంద్రప్ప, ఈరన్న, రామాంజి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ

తాడిపత్రి : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ వర్కర్‌గా పని చేస్తున్న అరిగాలా నరసింహులు శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, సబ్బి శివ రామకృష్ణ హాజరై నరసింహులును సన్మానించారు.

ఉద్యోగావకాశాలను వినియోగించుకోండి

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం ప్రాంతంలో ఉన్న దివ్యాంగులు యూత్ ఫర్ జాబ్ సంస్థ దివ్యాంగుల అందిస్తున్న ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మండల సమైక్య అధ్యక్షుడు నారాయణస్వామి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 3వతేదీ కళ్యాణదుర్గం ఆర్డీటీ ఫీల్డ్ ఆఫీసులో నిర్వహించనున్న ఇంటర్వ్యూల్లో 18-35ఏళ్లలోపు వయస్సు ఉన్న యువతీ యువకులు చదువుతో నిమిత్తం లేకుండా పైచదువులు చదివిన హాజరుకావచ్చన్నారు. పూర్తి వివరాలకు సెల్.. 95508 07789, 80089 12642 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి : విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో విప్ కాలవ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు విప్ కాలవకు ఘనంగా స్వాగతించారు. అనంతరం స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, కెపి దొడ్డి నాగరాజు, ఉస్మాన్‌సాబ్, జగదీష్, ప్రకాష్, ముత్తయ్య, మాజీ సర్పంచు గంగాధర్, బెలోడు సంజీవ, కుషల్, తిప్పేస్వామి, హరినాథ్, వెంకటేశులు, ఐటిడిపి మండల అధ్యక్షులు రవిచంద్ర, రమేష్, పరమేష్, పైదొడ్డి రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫైనాన్స్ ఆఫీసర్ మహమ్మద్ సేవలు అమోఘం

జెఎన్‌టియు విసి హెచ్ సుదర్శనరావు

మెహమ్మద్ సిరాజుద్దీన్‌ను సన్మానిస్తున్న విసి, అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఫైనాన్స్ ఆఫీసర్‌గా ఎం.మొహమ్మద్ సిరాజుద్దీన్ అందించిన సేవలు అమోఘమని ఉపకులపతి హెచ్.సుదర్శనరావు కొనియాడారు. సిరాజుద్దీన్ ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం జెఎన్‌టియులోని ఉపకులపతి కాన్ఫరెన్స్ హాల్‌లో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య అధ్యక్షతన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికీ ఉద్యోగ విరమణ తప్పనిసరి అన్నారు. అయితే ఆ ఉద్యోగి చేసిన సేవలను సంస్థ ఎప్పుడూ మరచిపోరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఓస్డ్ టు వీసీ దేవన్న, యునివర్సిటి డైరెక్టర్లు బి.దుర్గాప్రసాద్, వి.నాగ ప్రసాదనాయుడు, బి.ఈశ్వరరెడ్డి, జి.ప్రశాంతి, ఆర్.పద్మసువర్ణ, ఆర్.కిరణ్మయి, విబి చిత్ర, ఎ.సురేష్ బాబు, జి.వైశాలిగోర్పడే, పి.సుజాత, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, ఎపి శివకుమార్, నాగభూషణం, కె.నూర్‌మొహమ్మద్, షేక్ అబ్బాస్ అలీ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగలను సరి చేయాలి

కింద ఉన్న విద్యుత్‌తీగలను చూపుతున్న రైతుసంఘం నాయకులు, స్థానికులు

ప్రజాశక్తి-పుట్లూరు

దళితవాడలో ప్రమాదం అంచున ఉన్న విద్యుత్ తీగలకు మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎపి కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వీటీ రామాంజనేయులు కోరారు. ఈమేరకు మండలంలోని నారాయణరెడ్డిపల్లి దళితవాడలో ప్రమాదపు అంచుల్లో ఉన్న విద్యుత్ వైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితవాడలో ఉన్న విద్యుత్ వైర్లకు మరమ్మతులు చేయాలని అనేకమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కావున వెంటనే అధికారులు స్పందించి తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలకు మరమ్మతులు చేయాలని కోరారు. లేనిపక్షంలో స్థానికులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కె.నాగపుల్లయ్య, కె.ఓబులేసు, కాలనీవాసులు బ్రహ్మయ్య, నాగేంద్ర, వెంకటరాముడు, గోపాలు, చిన్నోడు, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL.DISTRICT JUDGE, ANANTHAPURAMU
E.P. No:502/2024 in ARC/FSBFL/1673/2023

Between:

M/S. Five Star Business Finance Limited, Anantapur Represented by its Authorized Signatory.G.Giddaiah, Kurnool **...Petitioner/ D.Hr**

V/S

1. Adawala Venkata Kondamma W/O Narayanaswamy, Hindu, age 52 years, business, D.No.19/3/400, Bhavani Nagar, Anantapur Town & District-515001.
2. A.Chandrasekhar S/O Narayanaswamy.Hindu, age 28 years, business,
3. A.Narayanaswamy S/O Narayanappa.A, Hindu, age 55 years,
4. A.Manjunatha S/O Narayanaswamy.A, Hindu, age 25 years,
5. Nagarjuna Kumar S/O Narayanaswamy. Hindu, age 30 years, business, All are residents of D.No.19/3/400, Bhavani Nagar, Anantapur Town & District-515001.

...Respondants/ J.Drs

వేలం ప్రకటన

అర్జీదారుడు ఇ.పి.మొత్తమును రాబట్టుటకు 1వ జె.డి.ఆర్.కు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నారు.వేలములో పాల్గొనదలచి వారు 16/06/2025వ తేదిన ఉదయం 10:30 గం॥లకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

SCHEDULE

The property is situated in RD and SRD of Anantapuram, within the limits of Anantapuram Municipal Corporation Area, Anantapur District. **Sy.No**.217/4, **A.C**:120 Cents paiki **A.C**:0.03 Paiki, Western side **A.C**:0.01 1/2, **H.S:** 0.006. Plot No:14, **Boundaries**: **East by**: Plot of C.Sreenivasulu, **South by**: Road, **West by**: Plot No. 13 (19/110A) and **North by**: Plot No.8. **Measurements**:**East-West**-16½ feet or 5.03 meters and **North-South** - 40 feet or 12.19 meters. **Totally measuring- 73.33 sq yards**
DHr Value Rs.6,30,000/-
Amina Value Rs.20,00,000/-

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
M.SURESH KUMAR, Advocate,
Ananthapuram. Cell: 9441168233.

ఆప్తాల్మిక్ ఆఫీసర్ దంపతులను సన్మానిస్తున్న వైద్యులు, వైద్యసిబ్బంది

ఆప్తాల్మిక్ ఆఫీసర్ సేవలు మరువలేం

ప్రజాశక్తి-శింగనమల

తరిమెల పిహెచ్‌సిలో ఆప్తాల్మిక్ ఆఫీసర్‌గా పని చేసిన ప్రసాద్ చేసిన సేవలు మరువలేమని వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ అన్నారు. ప్రసాద్ ఉద్యోగ విరమణ సందర్భంగా డాక్టర్ శంకర్‌నాయక్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ప్రసాద్ శింగనమల మండలంలోనే కాకుండా క్లస్టర్ పరిధిలోని కొర్రపాడు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, నార్పల, పప్పూరు పిహెచ్‌సిల పరిధిలో 15 సంవత్సరాలుగా పని చేస్తూ ఎంతోమందికి అంధత్వ నివారణకు కృషి చేశారన్నారు. అలాంటి ఆయన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు తేజస్విని, సిహెచ్ఒ గంగాధర్, పిహెచ్ఎన్ గ్రేసీ లలిత, సూపర్‌వైజర్ అశ్వర్థ నారాయణ, ఆయుష్ వైద్య సిబ్బంది, ఎల్‌టి తిప్పేస్వామి, ఆరోగ్య కార్యకర్తలు విజయ్, రమణయ్య, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే యోగా అలవర్చుకోవాలి

డిఎంహెచ్ఒ ఇబి. దేవి

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఇబి దేవి

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ యోగాను అలవర్చుకుంటే ఆరోగ్యంగా ఉంటారని డిఎంహెచ్ఒ ఇబి దేవి సూచించారు. శనివారం స్థానిక అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనివర్సిటీ ఉద్యోగులందరూ యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములై విజయవంతం చేయడం సంతోషకరమన్నారు. ప్రజలందరూ యోగా చేయడం వల్ల ఎంతటి రోగాలనైనా శరీరం తట్టుకునే శక్తి వస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ యోగాను చేసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ అధికారులు రామ్‌కుమార్, లాల్యానాయక్, యోగా గురువులు కృష్ణవేణి, గురురాజా, డెమో త్యాగరాజ్, డిప్యూటీ హెచ్ఇ గంగాధర్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అనిల్‌కుమార్, యూనివర్సిటీ అధికారులు, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ హనుమాన్ కేనాడి, కేశవరెడ్డి, సపాన్ సిండే, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్ : రోజూ యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిళ్లను ఆదిగమించి, మానసిక ప్రశాంతత లభిస్తుందని కమిషనర్ బాలస్వామి అన్నారు. శనివారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఉద్యోగులకు యోగాభ్యాసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవనానికి ప్రతిఒక్కరూ రోజూ యోగా సాధన చేయాలన్నారు. అనంతరం సరైన శ్వాస విధానాలు, వివిధ రకాల శారీరక మరియు మానసిక ఆరోగ్య సమస్యలకు గొప్ప పరిష్కారాన్ని అందించే మెళకువలను సురేష్, యోగాలయ్ వ్యవస్థాపకులు సురేష్ ఈశాపతి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ పావని, ఎస్ఇ చంద్రశేఖర్, ఇఇ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ సేవలు చిరస్మరణీయం

నూర్‌మొహమ్మద్‌ను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన నూర్ మొహమ్మద్ చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు నూర్ మొహమ్మద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఎంపిడిఒ భాస్కర్, ఇఒఆర్‌డి శైలజారెడ్డి, కార్యాలయ పరిపాలన అధికారి ఉమాదేవి, ఆర్డబ్ల్యూఎస్ ఇంజినీర్ జనార్ధన్, ఎంపిటిసి గొల్లపల్లి శంకర్, పద్మాకర్‌రెడ్డి, రాజారెడ్డి, సర్పంచులు రాంభూపాల్‌రెడ్డి, కుళ్లాయప్ప, రామాంజనేయులు, కుళ్లాయారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హిందీ ఉపాధ్యాయుడి ఉద్యోగ విరమణ

మండల పరిధిలోని బి.పప్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న జూటూరు షరీఫ్ శనివారం పదవీ విరమణ చెందారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ గేయనంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చెందిన షరీఫ్ సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం షరీఫ్ రచించిన చెట్టు (వచన శతకం) పుస్తకాన్ని మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ చిగిచర్ల ఓబిరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్లు నార్పల సత్యనారాయణరెడ్డి, ఆదినారాయణ, ఎంఇఒలు కృష్ణయ్య, నారపరెడ్డి ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జయరామ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, అభ్యుదయ రచయితల సంఘం సభ్యులు నాగేంద్ర, ప్రధానోపాధ్యాయురాలు రాధాదేవి, తదితరులు పాల్గొన్నారు.

2న జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం

ఉరవకొండ : వేసవి సెలవులు అనంతరం 2025-26 విద్యా సంవత్సరం జూన్ 2 నుంచి ఇంటర్ జూనియర్ కళాశాలలను పునఃప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ మమత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు ఏప్రిల్ నెలలోనే ప్రభుత్వం పంపగా పంపిణీ చేశామన్నారు. మిగిలైన వారికి కూడా త్వరలోనే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం మొదటి రోజు నుంచే మధ్యాహ్నం భోజనం ఉంటుందన్నారు. అలాగే సంక్షేమ వసతి గృహాలు కూడా సోమవారం నుంచి ప్రారంభం అవుతాయన్నారు. కావున విద్యార్థులు గమనించి మొదటి రోజు నుంచే కళాశాలకు రావాలని సూచించారు.

వైభవంగా పెన్నోబులేషుడి పల్లకిసేవ

ఉరవకొండ : మండలంలోని పెన్నోబిలంలో వెలసిన సుప్రసిద్ధ లక్ష్మీనరసింహస్వామి పల్లకిసేవ శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామివారి శ్రీదేవి, భూదేవి సహిత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సాకే.రమేష్ బాబు అర్చకులు ఆలయ సిబ్బంది పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పల్లకిసేవ నిర్వహిస్తున్న భక్తులు

ఏడాది పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలి

బిసివై నియోజకవర్గ అధ్యక్షులు గౌని ప్రతాపరెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న గౌని ప్రతాపరెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా నియోజకవర్గంలో ఏడాది పాలనపై స్థానిక ఎమ్మెల్యేకాలవ శ్రీనివాసులు శ్వేతపత్రం విడుదల చేయాలని బీసీవై పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు గౌని ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం రాయదుర్గం పట్టణం బీసీవై పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ అధ్యక్షులు, అడ్వకేట్ గౌని ప్రతాపరెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రస్తుత ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు 50 వారాల సెల్ఫీ ఛాలెంజ్ విసిరి తనను గెలిపిస్తే ఆయా పనులు చేసి చూపిస్తానన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ప్రధానంగా టిడ్కో ఇల్లు, వంద పడకల ఆసుపత్రి మరియు శాసనసభ్యులు వారు గత 50 వారాలలో చేసిన తదితర అభివద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. వీటితోపాటు ఆయన ఇచ్చిన హామీలన్నింటిపై స్పందించాలని సూచించారు.

వందశాతం పింఛన్లు పంపిణీ

బొమ్మనహాల్ : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వందశాతం ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ విజయభాస్కర్ అన్నారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఎపి ఎన్‌జిఒ నూతన రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆలపర్తి విద్యాసాగర్

అనంతపురం : ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులుగా ఆలపర్తి విద్యాసాగర్ శనివారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా అనంతపురం నగర ఎన్‌జిఒ అధ్యక్షులు ఎం.మనోహర్‌రెడ్డి ఆలపర్తి విద్యాసాగర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసిశుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రములో ఇరిగేషన్ ఉద్యోగులు దౌలా, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా మారుతీనాయుడు

అనంతపురం : వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా మారుతీనాయుడు నియమితులయ్యారు. ఈమేరకు వైసిపి కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉమ్మడి మదన్మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సంధర్భంగా వీరిద్దరూ వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతాం

విలేకరులతో మాట్లాడుతున్న ఎన్‌వి రమణ

అనంతపురం : ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతామని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ఎన్‌వి నారాయణ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల టిడిపి నిర్వహించిన మహానాడులో జగన్‌ను విమర్శించడం తప్ప హామీల అమలుపై స్పష్టత లేదని విమర్శించారు. వైసిపిని అణగదొక్కే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై వెన్నుపోటు దినంగా 4వతేదీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో రైతులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ వైసిపి బిసి సెల్ శ్రీనివాసులు, ఎస్‌టి సెల్ ఉపాధ్యక్షులు గోవింద్‌నాయక్, మున్సిపల్ విభాగం కార్యదర్శి వడ్డే రామచంద్ర పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

అన్నదానం చేస్తున్న దృశ్యం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో శనివారం ఆదర్శనగర్‌లోని ఆశ్రమం వద్ద పేదలకు శనివారం అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యులు శ్రీనివాసులు తాత, స్వాతంత్ర్య సమరయోధులు, పెనుగొండ మాజీ సమితి ప్రెసిడెంట్ రామచంద్రయ్య వర్ధంతిని పురస్కరించుకుని అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుశీల, భాగ్యలక్ష్మి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇరిగేషన్ డిపార్ట్మెంట్, లక్ష్మీనారాయణ, మణిదీప్, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గుత్తి : ఈనెల 2వ తేదీన గుత్తిలో జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ డి.ఓబులేసు, సిఎస్‌డిటి కె.సూర్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వసుధ ఫంక్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమానికి కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధ్యక్షత వహిస్తారన్నారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ-పాస్, వేయింగ్ యంత్రాల పరిశీలన

యంత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

యల్లనూరు : మండలంలోని పలు రేషన్ దుకాణాల్లో ఈ-పాస్, వేయింగ్ యంత్రాలను పల్నాడు జిల్లా ప్రత్యేకాధికారి అన్నురయ్య, ఆదోని లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. నేటి నుంచి రేషన్ దుకాణాల్లో నిత్యావసరాలు పంపిణీ చేయనున్న నేపథ్యంలో ఈ-పాస్, వేయింగ్ యంత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ వాలంటీర్ మృతి

కణేకల్లు : మండల పరిధిలోని ఎన్.హనుమాపురం గ్రామానికి చెందిన మాజీ వాలంటీర్ పుష్ప (38) శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. నిరుపేద హరిజన కుటుంబానికి చెందిన పుష్ప గత వైసిపి ప్రభుత్వంలో వలంటీర్‌గా పని చేసింది. భర్త నాగరాజు స్టోర్ డీలర్‌గా పని చేశారు. అయితే ప్రభుత్వం మారిన నేపథ్యంలో వాలంటీర్‌తోపాటు రేషన్ డీలర్‌గా భర్త నాగరాజును తొలగించడంతో మానసికంగా ఇబ్బంది పడ్డారు. చేసేది లేక కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. కుటుంబ పోషణ ఆధారం లేకపోవడంతో మానసిక వేదనకు గురైన పుష్ప తీవ్ర అనారోగ్యంతో మృతిచెందింది.